క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పాలీసెట్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


గాయత్రి

సింహాద్రిపురం : మండల పరిధిలోని హిమకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అన్నవరం గాయత్రి ఏపీ పాలీసెట్ పరీక్షల్లో 178వ ర్యాంక్ సాధించిందని ఎంఈఓ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. అలాగే ఇదే పాఠశాలలో చదువుతున్న వెంకటగణేష్‌కు 1143 ర్యాంక్ సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాలీసెట్‌లో ప్రతిభ కనబరచడంతో హెడ్మాస్టర్ రవిచంద్రారెడ్డితోపాటు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గురిజాలలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆయిషా

సింహాద్రిపురం : మండల పరిధిలోని బిదినంచర్ల పీహెచ్‌సీ పరిధిలోని గురిజాల గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ ఆయిషా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు, బాలింతలకు తదితర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లీలావతి, సచివాలయ సిబ్బంది రమాదేవి, ఆశా కార్యకర్తలు పద్మావతి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ శర్మకు మొల్ల సాహితీ సేవ పురస్కారం

చెన్నూరు : ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ ఇటుకుళ్ళపాడు ప్రసాదశర్మను మొల్లసాహితీ పురస్కారంతో సత్కరించారు. శనివారం మండల పరిధిలోని శాటిలైట్ సిటీ వద్ద విద్వాన్ డాక్టర్ గానుగపెట్ట హనుమంతరావు ప్రసాదశర్మకు అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ప్రసాద శర్మ మొల్ల రామాయణంలో «హనుమంతుని వర్ణన» అనే అంశంపై ఆయన చేసిన ప్రసంగం వెలకట్టలేనిదని తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాల అవార్డుకు విద్యార్థినుల ఎంపిక

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు కేశవప్రియ, మహెబూబ్‌లు జగనన్న ఆణిముత్యాల అవార్డుకు ఎంపికయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల త్రివిక్రమరెడ్డి శనివారం తెలిపారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం .సుధీర్‌రెడ్డి ఒకొక్కక్కరికి రూ.15 వేలు నగదు బహుమతిని అందజేయునున్నట్లు తెలిపారు.

పాదరక్షలు పంపిణీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఇండియా సిమెంట్స్ ఆధ్వర్యంలో 108 మంది వృద్ధులకు పాదరక్షలను ఐసీఎల్ కాలనీలోని ఉమామహేశ్వర్ స్వామి దేవాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఐసీఎల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్లాంట్ హెచ్‌ఆర్ హెడ్ బి నాగిరెడ్డి, బి.సుధాకర్‌రెడ్డి, శరవనన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


కార్యక్రమంలో ప్లే కార్డులు ప్రదర్శిస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు : స్వచ్ఛభారత్ ద్వారా మన మున్సిపాలిటీలో పర్యావరణాన్ని కాపాడుకుందామని శానిటేషన్ అధికారి నూర్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక మస్టర్ పాయింట్‌లో మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహేర్ అనే కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో మొక్కలను పెంచడంతోపాటు చెట్లను నరకకుండా, నీటిని వృథా చేయకుండా చూసుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ ఏర్పాట చేసిన చెత్త డబ్బాలలోనే వేయాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ వైపు.. దేశం చూపు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


పి.కొత్తపల్లెలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగిస్తున్న జగనన్న ప్రభుత్వం పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దచెప్పలి సచివాయల పరిధిలోని పెద్దచెప్పలి, పి.కొత్తపల్లె, ఈడిగపల్లె గ్రామాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, జరిగిన లబ్ధిని వివరించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు, ఇండ్లు, ఇంటి స్థలాలు, భూములకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెబుతున్న సమస్యలను అక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈ పాలనను దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్య మంత్రులు గమనిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు నభూతో నభవిష్యత్ అన్నారు. రైతులు పడుతున్న కష్టాలను నివారించడానికి ప్రతి 2వేల జనాభాకు ఒక ఆర్‌బీకే నిర్మించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, యంత్రాలు అన్ని రకాల సేవలు రైతు ముంగిటకే చేర్చుతున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. ఏపీలోని ఆర్‌బీకేలను ఇతర రాష్ట్రాల మంత్రులు, కేంద్ర మంత్రులు సైతం ఏపీకి వచ్చి పరిశీలించి వారి రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారని కొనియాడారు. ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు ఇంటికే చేర్చుతున్నారని, ఇంటి వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్ద చెప్పలి చిన్ని, పి.చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, నామాల శేఖర్, మర్రి సుబ్బన్న, చంద్రపాల్, చంటి, వెంకటసుబ్బయ్య, తిరుపాల్, గంగరాజు, దుబ్బయ్య, మైసూరారెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, నిఖిల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మస్తానయ్య, మహ్మద్ గౌస్, అయ్యవారయ్య, చెన్నారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గండి శాశ్వత నిత్యాన్నదానానికి విరాళాలు


దాతలకు అన్నదాన వివరాల బ్రోచర్ ఇస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.లక్షకు పైగా విరాళాలు వచ్చాయని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. వేంపల్లె మండలం చింతలమడుగుపల్లెకు చెందిన నల్లమేకల కృష్ణయ్య ఆయన సతీమణి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు కలసి రూ.50,116లు ఇచ్చారని ఆయన తెలిపారు. వీరికి ఆలయం సాంప్రదాయం ప్రకారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చే యించి తీర్థ ప్రసాదాలు అందజేశామన్నారు. అలాగే విరాళాల కౌంటర్ల ద్వారా మరో రూ.50 వేల వరకు వచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రవీణ

వల్లూరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రవీణ తెలిపారు. వల్లూరులోని శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మన పరిసరాలు పరి శుభ్రంగా వుండేలా తీర్చిదిద్దుకోవాలన్నారు. పరిశుభ్రత వలన కలిగే ఉపయోగాలను గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

క్యాంప్ ఆఫీస్ నిర్మాణానికి భూమిపూజ


ఆర్డీఓ కార్యాలయ ఆఫీస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఓఎస్డీ, తదితరులు


పులివెందుల టౌన్ : పులివెందుల రెవెన్యూ డివిజనల్ కార్యాలయ క్యాంపు ఆఫీస్ నిర్మాణానికి శనివారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డిలతో కలిసి భూమిపూజ చేశారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయ సమీపంలో గల స్థలంలో ఆర్డీఓ కార్యాలయ క్యాంపు ఆఫీస్ నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఓఎస్డీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మందకృష్ణ మాదిగ

వల్లూరు : మండలంలోని పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన శివగణేష్, అమరావతిల వివాహం కొద్ది రోజుల క్రితం జరిగింది. వివాహానికి రాలేకపోయిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ శనివారం పుల్లారెడ్డిపేటకు వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వైభవం.. కడప రాయుడి మాసోత్సవం


రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడపగా భావించే దేవునికడపలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు తివిక్రమ్ బృందం తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం, అనంతరం అలంకారం నిర్వహించారు. పూజల అనంతరం శ్రీవారిని ఇరువైపుల శ్రీదేవి, భూదేవిలతోసహా రథంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్లను స్థానిక భక్తులు దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదలంటే బాబుకు ఎప్పుడూ అలుసే..

ఎర్రగుంట్ల : బడుగు బలహీన వర్గాల ప్రజలంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ అలుసే అని ఆంధ్రరాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ వైవీ డేవిడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న పేదలకు ఇస్తున్న స్థలాలను సమాధులతో చంద్రబాబు పోల్చడంపై ఆయన మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఏ ఒక్కరికైన ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజలు బుద్ధి చెబితే ఎలా ఉంటుందో గత ఎన్నికలలో చంద్రబాబు చూశారని, ఈ సారి ఎన్నికల్లో టీడీపీకి శాశ్వత రాజకీయ సమాధే అని తెలియజేశారు.

అమ్మఒడి పథకానికి 75 శాతం హాజరు తప్పనిసరి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాలలో భాగంగా అమలు చేస్తున్న అమ్మఒడి పథకానికి విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని మండల విద్యా శాఖాధికారి బండి వీరారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన ఈకేవైసీ డేటా మీకు వస్తుందని.. 29వ తేదీలోపు కంప్లీట్ చేయాలన్నారు. జూన్ 8వ తేదీన తాత్కాలిక అర్హుల, అనర్హుల జాబితా విడుదలవుతుందన్నారు. అమ్మఒడి పథకానికి సంబంధించి జూన్ 13న తుది జాబితా విడుదల అవుతుందన్నారు. అమ్మఒడి పథకానికి 75 శాతం హాజరుతోపాటు బియ్యం కార్డు కలిగి ఉండాలి, 6 ఏళ్లపైన ఉన్నవారికి ఆధార్ సెంటర్‌లో ఫింగర్ అప్‌డేట్ చేయించి ఫోన్ నెంబర్ లింక్ చేయించుకోవాలన్నారు. అలాగే తల్లి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ ఫోన్ నెంబర్ లింకు అయి ఉండాలన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

చింతకొమ్మదిన్నె : మండలాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివార మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండల అభివృద్ధికి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు. వేసవి సమయం కావడంతో ప్రతి పంచాయతీలో నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కథలు చెప్పడం, పద్యాలు చెప్పడం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఐస్ క్రీమ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు యంత్రాంగంలో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మూడు సరెండర్ లీవుల మొత్తాన్ని సుమారు రూ. 560 కోట్ల మేరకు ఆయా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. దీనిపై ఏపి పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మొత్తాన్ని పోలీసుల బ్యాంకుఖాతాల్లో జమ చేయడంతో ఒక్కొక్కరికి రూ. 90 వేల నుంచి రూ. లక్ష లేదా ఆపైన మొత్తం వస్తుందని ఆయన తెలియజేశారు.

22 నుంచి ఉద్యోగుల సమస్యలపై దీక్షలు

కడప రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22 నుంచి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్‌కుమార్ తెలిపారు.

'ఆర్‌ఆర్‌ఆర్'ను సద్వినియోగం చేసుకోండి


ఎర్రగుంట్లలో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి తెలిపారు. శనివారం మేరి లైఫ్ స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వారి ఇళ్లల్లో ఉన్నటువంటి పాత వస్తువులు, బట్టలు, చెప్పులు, పాత సైకిళ్లు, మంచాలు, కుర్చీలు, పుస్తకాలు, కంప్యూటర్లు, సెల్ ఫోన్లు, ఇతర వస్తువులు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ పేరుతో డిపాజిట్ చేయవచ్చన్నారు. ఆ వస్తువులు ఎవరైనా తిరిగి వినియోగించుకుంటామని అడిగితే వారికి అందిస్తామన్నారు. ఇలా కొందరికి ఉపయోగం లేని వస్తువులు మరి కొందరికి ఉపయోగపడే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ షఫీవుల్లా, సీనియర్ అసిస్టెంట్ రాము, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని రాజీవనం సచివాయలం నందు మున్సిపల్ ఆధ్వర్యంలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాన్ని ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణకు వచ్చేవారికి వినియోగించని వేస్ట్ వస్తువులను అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణాన్ని అలవరుచుకోండి


బిదినంచర్లలో కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ రోషన్

సింహాద్రిపురం : గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని అలవరుచుకోవాలని.. ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా చూడాలని ఎస్ఐ రోషన్ తెలిపారు. మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామంలో శనివారం పోలీసులు గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ జోలికి వెళితే జీవితాలు నాశనమవుతాయని.. సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని చేతిలోకి తీసుకుని రౌడీయిజం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే రౌడీషీటర్లను పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే మండలంలో ప్రమాదాలు జరుగుతున్న యల్లనూరు క్రాసింగ్, నిడివెల్ల క్రాసింగ్, నక్కలపల్లె క్రాసింగ్ ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు బారీ కేడ్లను ఏర్పాటు చేశారు.

ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై అవగాహన


ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ బల్బుల వినియోగంపై అవగాహన కల్పించారు. శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలతో మమేకమై ఎల్‌ఈడీ బల్బులు వినియోగించడంవల్ల కలిగే లాభాలు, విద్యుత్ వినియోగం తగ్గుట, డబ్బు ఆదా ఆగుట, తక్కువ ఉష్ణం విడుదల చేయడం, దీర్ఘకాలంగా పనిచేయడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంప్యూటర్ అధ్యాపకులు షఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన పెంచుకోవాలి

ముద్దనూరు : రాబోయే ఖరీఫ్ పంటల సాగులో రైతులు తెగుళ్ల నివారణ, సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏపీడీ పద్మలత, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ప్రత్యూషలు సూచించారు. శనివారం మండలంలోని మంగపట్నం గ్రామంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి వారు ప్రత్తి, వేరుశనగ, కంది, జొన్న, బత్తాయి పంటల సాగుపై అవగాహ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్తి పంటలో గులాబీరంగు పురుగు, వేరుకుళ్ళు తెగుళ్ళ వ్యాప్తి నివారణకు సూచనలు ఇచ్చారు. ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవిలో చల్లని పానీయాలు తీసుకోవాలి


కొండాపురం : చలివేంద్రం ప్రారంభించిన సీఐ, ఎస్ఐలు


పెండ్లిమర్రిలో ప్రారంభిస్తున్న ఎస్ఐ సునీల్‌కుమార్

కొండాపురం : వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉండటంతో ప్రజలు మధ్యాహ్నం సమయంలో బయటకు రాకుండా చల్లని మజ్జిగ, నీళ్లు ఎక్కువగా పానీయాలు తాగాలని సీఐ సుదర్శన్ ప్రసాదు, ఎస్ఐ రవికుమార్‌లు తెలిపారు. శనివారం తాళ్ళప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభించారు.

పెండ్లిమర్రి : ఎండలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలని జిల్లా ఎస్పీ అదేశాల మేరకు శనివారం పెండ్లిమర్రి బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో హజరత్ బంగ్లేషావలీ ఉరుసు


ఫకీర్ల మేళతాళాల మధ్య గంధం కలశాన్ని తీసుకొస్తున్న ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తదితరులు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని గండివాటర్ వర్క్స్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదర్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ అలియాస్ బంగ్లేషావలీ ఉరుసు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులైన కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి సజ్జాద నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఈ సందర్భంగా తమ స్వగృహం నుంచి గంధం కలశాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. అనంతరం గురువుల మజార్ వద్ద గంధాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించి ఫాతెహా చేసి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు నిండిపోయాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఖవ్వాలీ గాయకుల భక్తిగానం ఉర్రూతలూగించింది.


వైఎస్సార్ మెమోరియల్ పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు


పార్కులో ఆకర్షణీయంగా ఉన్న వైఎస్సార్ విగ్రహం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

వైఎస్సార్ పార్కులో సందడే సందడి

పులివెందుల : పులివెందుల పట్టణ చిన్నారులు వేసవి సెలవులను వైఎస్సార్ మెమోరియల్ పార్కులో మస్త్ ఎంజాయ్ చేస్తున్నారు. గతంలో పార్కులు ఉన్నా.. ప్రస్తుతం మైత్రి లేఅవుట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కులో అన్ని వసతులు ఉండేలా చక్కగా డిజైన్ చేశారు. చిన్నారుల జన్మదిన వేడుకలు, వెడ్డింగ్ ఫొటోషూట్ కూడా ఇందులో తీసుకునే సౌకర్యం కల్పించారు. ఇలా అన్ని వసతులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచనలతో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి చక్కగా ఏర్పాటు చేయించడంతో సెలవు రోజుల్లో పార్కు కిక్కిరిసిపోతోంది. ఎక్కడ చూసినా పిల్లల కేరింతలు, పచ్చికలో పెద్దల ముచ్చట్లు సరదాగా ఉంటున్నాయి. వీకెండ్‌లో అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కు హౌస్‌ఫుల్ అవుతోంది. అందరికి అందుబాటులో పార్కును తీర్చిదిద్దడంపై చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వైఎస్సార్ పార్కులో వర్కౌట్లు చేస్తున్న చిన్నారులు


పార్కులో కలియ తిరుగుతున్న సందర్శకులు